క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన సోమవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పాండు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పండ్లు అమ్మిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



పండ్లు అమ్ముతున్న ఎమ్మెల్యే

పరిగి: ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి శనివారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా మార్కెట్ యార్డులో రైతులను, వ్యాపారస్తులను తమకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పండ్లు అమ్ముతున్న వ్యా పారి వద్దకు వెళ్లి పండ్లు తూకం వేసి వినియోగదారులకు అమ్మారు. తాను పట్టణ అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానని, ప్రతి వ్యాపారికి అందుబాటులో ఉంటానన్నారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఆలయం మూసివేత



అనంతగిరి: అనంతపద్మనాభ స్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 9గంటల వరకు మూసివేయడం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం ఆలయాన్ని శుద్ధి చేసి ఉ.11 గంటల నుంచి భక్తులకు పునర్దర్శనం కల్పిస్తామని ఆలయ ఈఓ నరేందర్, ట్రస్టీ పద్మనాభం పేర్కొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని ఖాజాఅహ్మద్‌పల్లి గ్రామంలో బోయ కులస్తులు వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం గ్రామంలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మొదటిసారిగా గ్రామంలో వాల్మీకి జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు, గోపాల్, అనంతప్ప, పకీరప్ప, కృష్ణప్ప, హన్మప్ప, వెంకటప్ప, ఈశ్వరప్ప, ప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దోమ: ప్రతి ఒక్కరూ రోడ్డుభద్రత, పోలీసు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్‌ఐ రవిగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వాహనదారులకు రోడ్డుభద్రత, ఎన్నికల నియామావళి, పోలీసు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులలో ప్రజలందరూ పోలీసులకు సహరించాలని, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది హీరాలాల్, రంజిత, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



బషీరాబాద్: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి భార్య ఆర్తి రెడ్డి ఓ ఆలయంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బషీరాబాద్ మండలం దామర్‌చెడ్‌లో అంబాభవానీ మాత ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఇందులో 500 మంది ముత్తైదువులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే భార్య ఆర్తిరెడ్డి పూజలో పాల్గొన్న మహిళలకు చీరలు అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా చీరలు పంపిణీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఇదే విషయమై ఆలయ పీఠాధిపతి శంకర్‌స్వామిజీని 'సాక్షి' వివరణ కోరగా భవానీ మాత అమ్మవారి చీరలను పౌర్ణమి సందర్భంగా ఆర్తి రెడ్డి చేతుల మీదుగా అందజేశామని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని చెప్పారు.

పింఛన్ కోసం పడిగాపులు!

- సర్వర్ మొరాయింపుతో ఇబ్బందులు
- అసహనం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

దోమ: సర్వర్ మొరాయింపుతో వృద్ధులు, వికలాంగులకు ఆసరా పింఛన్ అందక నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిండి తిప్పలు లేక పడిగాపులు కాస్తూ నిరీక్షిస్తున్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో శనివారం పింఛన్ అందించే ఫీనో మిషన్‌లో సర్వర్ సమస్య తలెత్తింది. దీంతో ఆయా గ్రామాల నుంచి పింఛన్ కోసం వచ్చిన వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడ్డారు. అధికారులు వేలిముద్రలు తీసుకోవడంలో ఆలస్యం అవుతుంది. ఎప్పుడు సిగ్నల్ వస్తుందోనని ఎదురుచుస్తూ ఎండల తీవ్రతకి ఆకలితో అలమటించారు. మధ్నాహ్నం తర్వాత సర్వర్ సమస్య తీరడంతో పింఛన్‌లు అందజేశారు. సంబంధిత అధికారులు ఫినో మిషన్‌లో సిగ్నల్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల పింఛన్ దారులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ చేతల ప్రభుత్వం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్, బీజేపీలకు మాటలు చెప్పడం తప్ప చేయడం చేతకాదని, బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పడం కాదు చేసి చూపిస్తోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని 12వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటమి భయంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఇన్ని సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రానికి చేసింది ఏమి లేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలను, ప్రస్తుత సీఎం కేసీఆర్ పాలనను పోల్చిచూడాలని ప్రజలను కోరారు. గత ప్రభుత్వాల్లో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రాష్ట్రంలో మెజార్టీ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరు బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మాజీ జిల్లా కోఆప్షన్ మెంబర్ మీర్ మహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎదిరే కృష్ణ, కిరణ్, మునీర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆనంద్‌ను ఓడించాలి



మర్పల్లి: ప్రజాసమస్యలను పట్టించుకోని వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌ను ఓటు అనే వజ్రాయుధంతో ఓడించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గూడెం రాములుయాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. గతంలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులే గ్రామాల్లో కనిపిస్తున్నాయన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జాఫర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, సీనియర్ నాయకులు నర్సింలుయాదవ్, వెంకటేశం, విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మర్పల్లి: బీఆర్ఎస్ పాలనపై విసుగు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన ఇతర పార్టీల భజన మండలి సభ్యులు మండల బీసీ సెల్ అధ్యక్షుడు సర్వేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి రవీందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించాలంటే ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రసాద్ కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాములుయాదవ్, జిల్లా ప్రధానకార్యదర్శి సంజీవరెడ్డి, మండల నాయకులు అబ్రహం, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ ఉన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి



తాండూరు టౌన్‌లో కొనసాగుతున్న పాదయాత్ర

తాండూరు టౌన్: పట్టణ పరిధిలో 'పైలట్ పాదయాత్ర' పేరుతో ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి రెండు రోజుల పాటు పాదయాత్ర కొనసాగించారు. శనివారం పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి, ఇందిరానగర్‌లతో పాటు పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని వార్డులకు రూ. కోటి చొప్పున కేటాయించానన్నారు. ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలలను తిరిగి తాండూరుకు తీసుకొచ్చానని తెలిపారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టామన్నారు. పాత తాండూరువాసుల కోసం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించానన్నారు. తాండూరులో కాలుష్యాన్ని నివారించేందుకు జినుగుర్తి సమీపంలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయడంతో పాటు, తాండూరు చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మాణం చేశామని వివరించారు. తాండూరు గురించి అవగాహన లేనివారు ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నారని, వారిని ప్రజలు నమ్మొద్దని సూచించారు.

రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

పెద్దేముల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి రెండోసారి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని పెద్దేముల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రైతులకు రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంటు , పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అందుతాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మళ్లీ సమస్యలు తప్పవని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయడం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిషన్‌రావు, నరేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాణిక్యం, ప్రసాద్, రంగయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



యాలాల: ప్రచారం చేస్తున్న ప్రమోదిని, నేతలు

యాలాల: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని వికారాబాద్ జెడ్పీటీసీ, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తల్లి ప్రమోదిని పేర్కొన్నారు. శనివారం మండలంలోని అక్కంపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రూ. కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశారన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోతో మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వారికి నియోజకవర్గంలోని గ్రామాల పేర్లు కూడా సరిగ్గా తెలియదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

నా కొడుకును ఆశీర్వదించండి

బషీరాబాద్: తాండూరు ఎమ్మెల్యేగా మరోసారి తన కొడుకు పైలెట్ రోహిత్ రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తల్లి, వికారాబాద్ జెడ్పీటీసీ ప్రమోదిని కోరారు. శనివారం బషీరాబాద్‌లో ప్రచారం చేసి, అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. రోహిత్‌రెడ్డి మహిళా చేయూత కింద తాండూరు నియోజకవర్గంలో మహిళకు టైలరింగ్, చేనేత మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్స్, డ్రైవింగ్ స్కూల్ లాంటి కోర్సులను ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. స్వయం ఉపాధి కోసం చేస్తున్న చేయూతతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందారన్నారు. మహిళలు రోహిత్‌రెడ్డికి అండగా నిలువాలని కోరారు.

ఓటుహక్కు దరఖాస్తుల పరిశీలన

బొంరాస్‌పేట: ఆన్‌లైన్ ఓటుహక్కు దరఖాస్తుల పరిశీలన, ఎన్నికల విధుల పట్ల శిక్షణ నిర్వహించారు. ఈ మేరకు శనివారం మండల కార్యాలయ సమావేశం హాలులో బూత్ లెవల్ సిబ్బందికి ఎన్నికల నియమావళి ఫారం6, ఫారం8, తదితర అంశాలపై డిప్యూటీ తహసీల్దార్ రవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్ శిక్షణ ఇచ్చారు. ఫారం 7ను బీఎల్‌ఓల నుంచి స్వీకరించి పలు సూచనలిచ్చారు. అలాగే ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీఓ పాండునాయక్ తెలిపారు. రాజకీయ పార్టీల గుర్తులు, పోలింగ్ విధానం, ఓటర్ల తికమక, సందేహాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ విధులకు ప్రజలు సహకరించేలా అవగాహన కల్పించాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రవి, రవీందర్

తండ్రి కోసం కొడుకు, కూతురు ప్రచారం



ప్రచారంలో చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ కొడుకు, కూతురు

అనంతగిరి: వికారాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన కొడుకు వైభవ్, కూతురు వినూత్న ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం వారు వికారాబాద్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఎమ్మెల్యే సతీమణి డాక్టర్. సబితానంద్‌తో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొని మా నాన్నను ఆశీర్వదించాలని అభ్యర్థించారు.

పేదలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: నిరుపేదలందరికీ అండగా ఉంటామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ అన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన జోగు ఎల్లయ్య ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని సౌకర్యాలను అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉన్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం తథ్యం

మండల బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిలు నందు, కమాల్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధారూరు: వికారాబాద్ నియోజకవర్గంలో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ధారూరు మండల ఎన్నికల ఇన్‌చార్జిలు వడ్లనందు, కమాల్‌రెడ్డిలు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని అవుసుపల్లి, కుక్కింద, కొండాపూర్‌కలాన్, ధార్మాపూర్, నర్సాపూర్, గడ్డమీది గంగారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలుగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలంతా సంతృప్తితో ఉన్నారన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధిని సాధించిన ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను రెండోసారి ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తారని తెలిపారు. ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సంతోష్‌కుమార్, రాజునాయక్, విజయకుమార్, రాములు పాల్గొన్నారు.

తిరుమలకు భజన మండలి సభ్యులు



రుద్రారం భజన మండలి సభ్యులు

కొడంగల్ రూరల్: మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన వీరాంజనేయ భజన మండలి సభ్యులు శనివారం తిరుమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనేందుకు తిరుమల నుంచి ఆహ్వానం అందిందని తెలిపారు. ఈ మేరకు భజన మండలి సభ్యులంతా కలిసి వెళుతున్నట్లు చెప్పారు. ఈ నెల 31వ తేదీన ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు తమకు అఖండ హరినామ కీర్తనలో తమకు సమయం కేటాయించారని వివరించారు. ఇందులో భజన మండలి సభ్యులు డాక్టర్ సంఘమేష్, డాక్టర్ మనోహర్‌జీ, టి.సాయప్ప, జికె.బన్సీలాల్, కె.మోహన్‌రెడ్డి, బి.నాగరాజు, పి.అంబయ్యగౌడ్, సి.శేఖర్, కె.శేఖర్, జి.శివన్న, ఏ.ఆశప్ప, శివరాంరెడ్డి బయలుదేరారు.

రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలి

బీఆర్ఎస్ నాయకుడు వెంకట్

మోమిన్‌పేట: తెలంగాణ రాక ముందు వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో ఆలోచించుకోవాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో మోమిన్‌పేటలో 'కేసీఆర్ భరోసా' కార్యక్రమంతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో రోజుకు ఎన్ని గంటల విద్యుత్ సరఫరా చేశారో, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎన్ని గంటలు ఉచితంగా సరఫరా చేస్తున్నారో ఆలోచించుకోవాలని సూచించారు. రైతుబంధు, బీమాతో నేడు రైతు ఆత్మహత్యలను పూర్తిగా ఆగాయని తెలిపారు. ఓటు వేసే నిర్ణయం మహిళలు, రైతులకు వదిలేస్తున్నామని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి వల్ల బాల్య వివాహాలను అరికట్టామని వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, మండల రైతు బంధు అధ్యక్షుడు అజీజ్, సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ యువత అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రచారాన్ని విజయవంతం చేయండి

కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి

మర్పల్లి: నేటి (ఆదివారం) నుంచి మండలంలో మూడు రోజుల పాటు నిర్వహించే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి మండల నాయకుల, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డితో కలిసి ఆయన విలేకరుల మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. మండలస్థాయి కార్యవర్గం, వర్కింగ్ ప్రెసిడెంట్లు, పార్టీ అనుబంధ శాఖల కార్యవర్గం ఏకతాటిపైకి వచ్చి ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్ మాట్లా డుతూ.. ఎమ్మెల్యే ఆనంద్ గ్రామాల్లో ప్రచారం చేస్తూ మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌ను వ్యక్తిగతంగా దూషించడం సరికాదన్నారు. ఇక ముందు ప్రసాద్‌కుమార్‌పై అణుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. రవీందర్ మాట్లాడుతూ.. ఇప్పటికే పలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశామన్నారు. ప్రచారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా నాయకులు రాములు, రామేశ్వర్, బూచన్‌పల్లి ఎంపీటీసీ బాల్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి ఉన్నారు.

విజయభేరికి తరలిన నేతలు



యాలాల: బస్సు యాత్రకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

తాండూరు పట్టణంలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి రెండో విడత బస్సు యాత్రకు కాంగ్రెస్ శ్రేణులు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి భారీగా తరలివెళ్లారు.



పెద్దేముల్: బస్సు యాత్రకు తరలుతున్న కార్యకర్తలు

చీకట్లో రైల్వే బ్రిడ్జి



బ్రిడ్జిపై వెలగని విద్యుత్ లైట్లు

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రైల్వే బ్రిడ్జిపై చీకట్లు కమ్ముకున్నాయి. గత కొంతకాలంగా బ్రిడ్జిపై లైట్లు వెలగడం లేదు. లైట్లను మరమ్మతులు చేయించకుండా సంబంధిత అధికారులు జాప్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. పట్టణానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు, పోయే వాహనాలతో రోడ్డు బిజీబిజీగా ఉంటుంది. లైట్లు లేక పోవడం, ఇరుకుగా ఉండటంతో తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు చోట్ల మూల మలుపులు ఉండటంతో వాహనాలు అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బ్రిడ్జిపై విద్యుత్ లైట్లు వెలగకపోవడం కూడా ప్రమాదాలకు ఓ కారణమని పలువురు అంటున్నారు. విద్యుత్ లైట్లు వెలిగేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యావరణాన్ని కాపాడండి



శంకర్‌పల్లి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పర్వేద జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పర్వేద జిల్లా పరిషత్ ఆవరణలో బాలవికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎఫ్ఏఐ సహకారంతో పండ్ల మొక్కలను నాటారు. ప్రతిఒక్కరూ ఇంటి పెరట్లో, రైతులు తమ పొలాల వద్ద పండ్ల మొక్కలను నాటి కుటుంబ ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. తిరుపతి, శ్రీరాం, రహమాన్, రాజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



కొడంగల్ రూరల్ : పట్టణశివారులోని సిద్ధనొంపు పడమటి ఆంజనేయస్వామివారికి శనివారం హిందూవాహిని శాఖ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, సింధూరలేపనం, విశేష అలంకరణ, మంగళహారతులు అందిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో, దేవాలయానికి వెళ్లే దారిలో స్వచ్ఛమందిర్‌లో భాగంగా కంప చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో హిందూవాహిని సభ్యులు సురారం రాకేశ్, బాను ప్రకాష్‌లోమిటి, ఓంప్రకాష్, సర్వేష్, రఘుపతి, నిఖిల్, రఘు తదితరులు పాల్గొన్నారు.